క్లుప్తంగా

కాకానికి జంకె పరామర్శ



కాకానితో మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి సర్వేపల్లి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కాకాని గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సోమవారం పరామర్శించారు. అక్రమ కేసుల్లో అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చిన గోవర్ధన్‌రెడ్డిని జంకె కలిసి మాట్లాడారు. అధైర్య పడవద్దని, కూటమి కుట్రలను ఎదుర్కోవడంలో పార్టీ నేతలంతా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

పిచ్చికుక్క స్వైరవిహారం





గాయపడిన వెంకటేశ్వర్లు, రాజేశ్వరరావు

రాచర్ల: పిచ్చికుక్క కరవడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన రాచర్ల మండలంలోని జేపీ చెరువు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. జేపీ చెరువు గ్రామానికి చెందిన జెట్టి వెంకటేశ్వర్లు, గుమ్మ రాజేశ్వరరావుతో పాటు మరోవ్యక్తిపై పిచ్చికుక్క దాడి చేసింది. క్షతగాత్రులను గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం పింఛన్లు పంపిణీ చేసేందుకు వెళ్లిన సచివాలయ సిబ్బందిని పిచ్చికుక్క వెంబడించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పిల్లల బడిబాటకు ఎంఈఓ వీధిబాట!



బడికి రాని చిన్నారితో మాట్లాడుతున్న ఎంఈఓ

కంభం: మండలంలో బడి ఈడు పిల్లలను బడి బాట పట్టించేందుకు ఎంఈఓ అబ్దుల్ సత్తార్ సోమవారం వీధిబాట పట్టారు. పట్టణంలోని అరాఫత్ నగర్, అర్బన్ కాలనీ, పూసలబజారు, నాయక్ వీధి, రంగావీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి దీర్ఘకాలంగా బడికి రాని విద్యార్థులను, అసలు బడిలో చేరని పిల్లలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. తల్లిదండ్రులతో మాట్లాడి విద్య ఆవశ్యకతను, సామాజిక విలువలను తెలుపుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

పొదిలి: స్థానిక జీవిత బీమా సంస్థ శాటిలైట్ కార్యాలయంలో శనివారం ఆ సంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక వారోత్సవాలను స్థానిక బ్రాంచ్ మేనేజర్ గోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ.. సంస్థ 69 ఏళ్లుగా వినియోగదారులకు సేవలు అందిస్తోందన్నారు. ఎల్ఐసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఏఓ సుబ్బారావు, అభివృద్ధి అధికారులు పి.సుబ్రహ్మణ్యం, పి.చిరంజీవి, లియోఫీ, మార్కాపురం బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులు పిల్లి బాల నరసయ్య, మాజీ అధ్యక్షుడు మేడా నరసింహారావు, ఏజెంట్లు పాల్గొన్నారు.



కంభం : తురిమెళ్ల బ్రిడ్జి వద్ద అధ్వానంగా ఉన్న రహదారి



కంభంలో అర్బన్ కాలనీ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు ఇలా..



కంభం నుంచి కందులాపురం, ఎల్‌కోట గ్రామాల వైపు వెళ్లే రోడ్డు దుస్థితి

పండగలెంట పండగలొచ్చే..
పల్లె రోడ్లు బాబోయ్..!

కాలం చెల్లిన రహదారులకు మరమ్మతులు చేయాలన్న సంగతినే మరిచింది కూటమి సర్కారు. సరిగ్గా పది నెలల క్రితం రోడ్ల మరమ్మతుల పేరుతో డ్రామాకు తెరలేపి రక్తి కట్టించిన కూటమి ప్రభుత్వం.. ప్రస్తుతం గుంబనంగా ఉంటోంది. రోడ్ల మరమ్మతులకు భారీగా నిధులు కేటాయించినట్లు ప్రచారం చేసుకోవడంపై ఆసక్తి చూపిన ప్రభుత్వం.. ఒక్క రోడ్డును కూడా బాగు చేయకుండానే మమ అనిపించింది. సంక్రాంతి నాటికి రోడ్లు అద్దంలా మెరుస్తాయని సీఎం చంద్రబాబు మొదలుకొని కూటమి నాయకులంతా ప్రగల్భాలు పలికారు. కానీ పండగలెంట పండగలొస్తున్నా పల్లె రోడ్లు మాత్రం బాగుపడలేదు. పల్లెటూర్లకు రాకపోకలు సాగించాలంటే నిత్య నరకం అనుభవిస్తున్నామని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోకాలి లోతు గుంతలు పడి, కంకర బయటకు తేలిన రోడ్లపై వెళ్తుంటే వాహనాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వాపోతున్నారు.

- రహదారుల మరమ్మతుల పేరుతో కూటమి సర్కారు డ్రామా
- పది నెలలుగా రోడ్ల గుంతల్లో తట్టెడు కంకర పోయని వైనం
- నిత్య నరకం అనుభవిస్తున్న వాహనదారులు, ప్రయాణికులు
- వాహనాలు దెబ్బతిని అదనపు భారం పడుతోందని యజమానుల ఆవేదన



పొదిలి : ఏలూరు రోడ్డు దుస్థితి



కొనకనమిట్ల : గనివనిపాడు రోడ్డు



పొదిలి : ఓబులక్కపల్లి రోడ్డు



పొదిలి : కొండాయపాలెం రోడ్డు

పొదిలి:

పొదిలి మండలంలోని జువ్వలేరు, దర్శి రోడ్డు నుంచి అన్నవరం రాక పోకలు సాగించే రోడ్డు, ముసి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి ఏలూరు రోడ్డు, అక్కచెరువు నుంచి రామాపురం వరకు, మార్కాపురం రోడ్డు నుంచి కొండాయపాలెం రోడ్డు, ఓబులక్కపల్లి రోడ్డులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అడుగడుగునా గుంతలతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కొనకనమిట్ల మండలంలోని గనివనిపాడు రోడ్డు, కొంత మేర గొట్లగట్టు నుంచి నాయుడు పేట రోడ్డు, పాతపాడు నుంచి కాట్రగుంట రోడ్డు, పెదారికట్ల నుంచి ఒంగోలు రోడ్డు వయా ఇరసలగుండం రోడ్లు ప్రయాణానికి అసౌకర్యంగా మారాయి. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో కూటమి నేతలు ఆయా పంచాయతీల్లో హడావుడి చేశారు. ఇదిగో రోడ్డు బాగు చేయిస్తామని, చూస్తుండండి నాలుగు రోజుల్లో ఎలా మారుద్దో అని నమ్మబలికారు. పరిస్థితి అర్థమైందో ఏమో ప్రస్తుతం కిక్కురుమనడం లేదు. అధికారులు అయినా స్పందించి తగినన్ని నిధులు మంజూరు చేయించి రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నపాటి వర్షాలకే రోడ్లు ఛిద్రం

కంభం: చిన్నపాటి వర్షాలు కురిసినా రహదారులు ఛిద్రమైపోతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రధాన రహదారులు సైతం అధ్వాన్నంగా మారిపోతుండటంతో బస్సులు, ఆటోల్లో వెళ్లే ప్రయాణికులు నరకం చవిచూస్తున్నారు. కంభం నుంచి తురిమెళ్ల మీదుగా గిద్దలూరు వెళ్లే రహదారి చిన్నకంభం, తురిమెళ్ల, నల్లకాల్వ వద్ద ఛిద్రమైపోయింది. తురిమెళ్ల సమీపంలో వెలిగొండ ప్రాజెక్టు కాలువమీద ఉన్న బ్రిడ్జి ఎక్కువ ఎత్తులో ఉండగా కనీసం అక్కడ రోడ్డు కూడా వేయకపోవడంతో వాహనాలు ఎక్కి దిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కింద ఉన్న పాతరోడ్డులో నుంచైనా పోదామంటే ఆ రోడ్డంతా గుంతలమయంగా మారిపోయింది. కంభం నుంచి కందులాపురం, ఎల్‌కోట, లింగోలిపల్లి, ఔరంగబాదు, గ్రామాలకు వెల్లే ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా మార్జిన్లు పూర్తిగా దెబ్బతిని ఉండటం, రోడ్ల మధ్యలో గుంతలు పడటంతో ఆ మార్గంలో రాకపోకలకు వాహనదారులు జంకుతున్నారు. కంభంలో అర్బన్ కాలనీ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి సైతం కొంత మేర పూర్తిగా దెబ్బతింది. కంభం–గిద్దలూరు రహదారి మధ్యలో గతంలో వేసిన అతుకులు సైతం ఇటీవల కురుస్తున్న వర్షాలకు దెబ్బతినడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతులకు గురైన రహదారులపై పాలకులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



పొదిలి : జువ్వలేరు రోడ్డు ఇలా..

నేడు వైఎస్సార్ వర్ధంతి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో మంగళవారం దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామని, అనంతరం తూర్పువీధిలోని జువ్విచెట్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు వైఎస్సార్, జగన్ అభిమానులు హాజరుకావాలని కోరారు.

నాగులవరంలో నియోజకవర్గ స్థాయి సమావేశం

అర్ధవీడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం అర్ధవీడు మండలం నాగులవరం గ్రామంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. నియోజకర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, ఉదయం 10 గంటలకు ముఖ్యనాయకులు, సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

చప్టా నిర్మాణం ప్రారంభం



చప్టా నిర్మించేందుకు తవ్విన డ్రైనేజీ

సాక్షి ఎఫెక్ట్..

కంభం: స్థానిక కాలేజ్ రోడ్డులో ఉన్న డ్రైనేజీపై చప్టా పది రోజుల క్రితం కుంగిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతున్న విషయమై 'ప్రమాదకరంగా చప్టాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. కుంగిపోయిన చప్టాను తొలగించి నూతన చప్టా నిర్మించేందుకు పనులు ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా కొత్త లైన్లు వేస్తున్న కారణంగా మంగళవారం కొమరోలులోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. సర్విరెడ్డిపల్లె, కొమరోలు, పురుషోత్తమునిపల్లె, తాటిరెడ్డిపల్లె, కె.బొంతపల్లె, హనుమంతరాయునిపేట, కసినేపల్లె, గోహరపల్లె, కొత్తపల్లె, ఓబులాపురం, మలికేపల్లె, కూరాకువానిపల్లె, చింతలపల్లె, వర్ధనపల్లె, గోపాలునిపల్లె, బాదినేనిపల్లె, సూరవారిపల్లి, బొడ్డువానిపల్లి, మొట్టుపల్లి, బెడుసుపల్లి, రామవారిపల్లి, గుంతపల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రైతు వ్యతిరేక జీఓను రద్దు చేయాలి



ర్యాలీలో పాల్గొన్న రైతు సంఘ నాయకులు

మార్కాపురం: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు పాటిస్తూ వారికి వ్యతిరేకంగా విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం నాయకుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ.. విదేశీ పత్తి దిగుమతులపై ఇప్పటి వరకు ఉన్న 11 శాతం పన్నును రద్దు చేస్తున్నట్టుగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. ఈ ఏడాది ఆగస్టు 15న ఎర్రకోటపై ఘనంగా ప్రసంగించిన ప్రధాని మోదీ 15 రోజుల్లోనే పత్తి రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా జీవో తీసుకురావడం దుర్మార్గమన్నారు. దిగుమతి పన్ను రద్దు వల్ల దేశంలో పత్తి సాగును నమ్ముకున్న 6 కోట్ల మంది రైతుల జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, మరోవైపు పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో రోజుకు సగటున 31 మంది చొప్పున ఇప్పటి వరకు 4.50 లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు గత 11 ఏళ్ల కాలంలో 26 లక్షల కోట్ల రూపాయలను రాయితీ రూపంలో ఇచ్చారన్నారు. దీన్నిబట్టి కేంద్ర ప్రభుత్వం రైతు ప్రయోజనాల కన్నా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నట్టుందని విమర్శించారు. ధర్నా అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు డి.శ్రీనివాస్, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కే ఖాశీం, గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షుడు డి.పుల్లయ్య, వైపాలెం అధ్యక్షుడు బాణాల రామయ్య, సోమయ్య, పాపిరెడ్డి, గాలివెంకటరామిరెడ్డి, డీకేఎం రఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు జార్జి ఫార్మసీ కాలేజీలో వెబినార్



ఫ్లయర్స్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

మార్కాపురం టౌన్: డాక్టర్ శామ్యూల్‌జార్జి ఫార్మసీ కళాశాలలో మంగళవారం క్వాలిటీ అండ్ సేఫ్టీ ఇన్ హెల్త్‌కేర్ అంశంపై అంతర్జాతీయ వెబినార్ నిర్వహిస్తున్నట్లు కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. ఆరోగ్య రంగంలో నాణ్యత, భద్రత అనేవి కీలకమైన అంశాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ఫ్లయర్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు డాక్టర్ వై.సునీత, కె.అశోక్ బాబు, అనూష, దీప్తి, ఏఓ కృపాల్, బాలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన వైద్యశాలలపై చర్యలు

డీఎంహెచ్‌ఓ పద్మావతి హెచ్చరిక



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ పద్మావతి

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లోని ప్రైవేట్ వైద్యశాలల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి హెచ్చరించారు. సోమవారం ఆమె మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీ హాస్పిటల్, డాక్టర్ సీతారామశాస్త్రి వైద్యశాల, వినోద్ హాస్పిటల్‌ను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగులకు సేవలందించాలని తెలిపారు.

కుక్కలు, కోతుల నుంచి కాపాడండి

మార్కాపురం: కుక్కలు, కోతులతో రోజూ ఇబ్బందులు పడుతున్నారని, వాటి బెడద నుంచి కాపాడాలని వేములకోట, కొట్టాలపల్లి, వేములపేట వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. వేములకోట గ్రామానికి చెందిన జంకె చిన్న వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. మీ కోసం కార్యక్రమంలో మార్కాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 16 అర్జీలు వచ్చాయి. సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

ఉత్సాహంగా గణేష్ నిమజ్జనం



గొట్లగట్టులో చిందేస్తున్న యువతులు

కొనకనమిట్ల: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ఆరో రోజు సోమవారం సాయంత్రం భక్తుల సందడి నడుమ నిమజ్జనం చేశారు. గొట్లగట్టు హరిజన కాలనీలో, గనివానిపాడులో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకుడు, సర్పంచ్ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యువత, మహిళలు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. రేగడపల్లిలో యువకులు సందడి చేశారు. చినారికట్లలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం వద్ద లడ్డూను వేలంలో మర్రి వెంకటేశ్వర్లుయాదవ్ రూ.70 వేలకు దక్కించుకున్నారు.



మార్కాపురంలో గాజుల అలంకరణలో గణనాథుడు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని కోనేటి వీధిలో గణనాథుడిని సోమవారం గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అక్కమ్మబావి వీధిలో వినాయకుని విగ్రహాన్ని కురుకురే ప్యాకెట్లతో అలంకరించి పూజలు చేశారు.



చినారికట్లలో లడ్డూతో యువత

తల్లిదండ్రులపై దాడి చేయలేదు

- విలేకర్ల సమావేశంలో వృద్ధురాలి కుమారుడు

పొదిలి: వృద్ధులైన తమ తల్లిదండ్రులపై తాము ఎప్పుడూ దాడికి పాల్పడలేదని షేక్ మస్తాన్‌బీ కుమారుడైన గౌస్‌బాషా, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు చెప్పారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. గౌస్‌బాషా మాట్లాడుతూ తన చెల్లెలు ఆమె భర్త కలిసి ఉమ్మడి ఆస్తిని తమకు తెలియకుండా రాయించుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఇల్లు కూడా రాయించుకోవాలనే ఉద్దేశంతో మా తల్లిపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై పెద్దలు పలుమార్లు పంచాయితీ కూడా చేశారన్నారు. గతంలో మా తల్లి ఇంట్లో పడి దెబ్బలు తగిలాయని వాటికి కూడా అప్పుడు వైద్యం తామే చేయించామని చెప్పారు. దానిని చూపిస్తూ తమ తల్లితో పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేయించారని, వాస్తవానికి తమ తల్లిపై దాడి చేయలేదని స్పష్టం చేశారు. తమ చెల్లెలు కుటుంబంలో వివాదం ఏర్పడినప్పుడు కూడా పలుమార్లు వారి పెద్దల వద్దకు తిరిగి కాపురం నిలబెట్టామని చెప్పారు. గతంలో జరిగిన సంఘటనల వీడియోలను ఈ సందర్భంగా ప్రదర్శించారు.